# మీరూ ఆలోచించండి

సాయంత్రం ఆరవుతూంది.

ఆకాశం నల్లని కారుమబ్బు పట్టి చిటపట చినుకులు పడుతున్నాయి.

బయట చీకటి దట్టంగా అలుముకుంటోంది.

వీధి దీపాలు సరిగా వెలగటం లేదు.

"రాత్రికి పెద్దవాన కురవవచ్చు. కరెంటు పోతుందేమోనండి'' అంటూ శేషమ్మ చమురు సీసా హరికేన్ లాంతర్లు ముందు పెట్టుకుని ముగ్గుపిండి చేతిలోకి తీసుకుంది.

"కరెంటు వున్నా లేకపోయినా మన జాగ్రత్తలో మనం వుండటం మంచిది కదే. నీ పని నువ్వు కానియ్... లాంతర్లు వెలిగించి ఓ పక్కన పెట్టు'' అన్నాడు వెంకటసుబ్బయ్య అరచేత్తో బట్టతల నిమురుకుంటూ.

శేషమ్మ ఏదో అనబోయింది.

సరిగ్గా ఆ సమయంలో వీధి తలుపు టకటక శబ్దం అయ్యింది.

"ఎవరూ?'' అంటూ కేకపెట్టాడు వెంకటసుబ్బయ్య మడత కుర్చీలోంచి లేవకుండానే.

"బాబిగాడు వచ్చాడేమోనండి'' అంది శేషమ్మ. బాబిగాడంటే మనవడు... పెద్ద కూతురి పెద్దకొడుకు వాళ్ళ దగ్గరే ఉండి చదువుకుంటున్నాడు. ఏవో కాలేజీకి శెలవులు వస్తే తల్లి తండ్రిని చూడటానికి కాకినాడ వెళ్ళాడు. ఇవ్వాళో రేపో... వస్తాడని ఎదురు చూస్తున్నారు.

సుబ్బయ్య చేతిలో మట్ట పక్కన పెట్టి లేచి వెళ్ళి తలుపు తీశాడు.

ఎదురుగా సుమారు ఇరవై సంవత్సరాల అందమైన అమ్మాయి చేతిలో చిన్న ఎయిర్ బ్యాగ్‌తో నిల్చుని ఉంది.

నల్లటి వాయిల్ చీర జాకెట్టు చేతికి నల్లగా మట్టి గాజులు ఒంటిమీద పెద్దగా ఆభరణాలు లేవు. మెడకి చెవులకి కాస్త రంగు వెలసిన ఆర్టిఫిషియల్ ముత్యాలు అలంకరించుకుంది.

మనిషి పేదరాలుగ కనిపిస్తున్న మంచి చదువు సంస్కారం ఒద్దిక గల అమ్మాయిలా అనిపిస్తోంది.

కాస్త వృద్ధుడై పండిన జుట్టుతో గంభీరంగా వున్న సుబ్బయ్యని చూడగానే కొంచెం బెదిరినట్లు బిడియంగా వెనక్కి అడుగు వేసింది.

ఏదో చెప్పబోయి తటపటాయింపుగా ఆగిపోయింది.

"ఎవరు కావాలమ్మా'' అన్నాడు సుబ్బయ్య.

"ఇంట్లో ఆడవాళ్ళు ఎవరూ లేరాండి?'' అంది.

"ఎందుకు లేరు. మా ఆవిడ ఉందిగదా?'' అన్నాడు.

హాల్లోంచి ఈ సంభాషణ వింటున్న శేషమ్మ చటుక్కున లేచి చేతిలో చిన్నిగ్లాసు ముగ్గుపిండితో సహా ఇవతలకి వచ్చి "ఎవరమ్మాయ్ ... ఏం కావాలి?'' అంది.

ఆ అమ్మాయి రెండు చేతులు జోడించి వినయంగా నమస్కారం చేసింది.

"నా పేరు సుజాతండి... మాది మచిలీపట్నం. రాత్రి బండికి బయలుదేరి ఈ రోజు ఉదయం... ఉద్యోగరీత్యా ఇంటర్వ్యూ వుంటే ... సిటీకి వచ్చానండి... ఇంటర్వ్యూ అయిపోగానే రాత్రి తొమ్మిది గంటల బండికి తిరిగి వెళ్ళిపోదామనుకున్నానండి. కాని ఈ వానలకి ఎక్కడో రైలు మార్గాలు పాడయ్యాయిటండి. అందుకని ఇప్పటికిప్పుడు ఎనిమిది గంటల తర్వాత రైలుబళ్ళు అన్ని క్యాన్సిల్ చేశారుటండి. రేపు ఉదయం దాకా ఏమి ట్రైన్సు లేవుట. స్టేషన్‌లో చెప్పారు'' అంది దగ్గర్లోనే ఎదురుగా కనిపిస్తున్న రైలు స్టేషన్‌ని చూపిస్తూ.

"అయ్యో అలాగా?'' అంది శేషమ్మ.

"అవునండి. ఏం చెయ్యాలో తోచలేదు. ఒక్కర్తిని ఏదన్నా హోటల్‌లో రూమ్‌లో వుండాలంటే భయం. పైగా ఇంతవరకు అలా ఎప్పుడూ వుండలేదండి. పోనీ రైల్వే స్టేషన్‌లోనే వుందామన్న ఎందుకో భయం అనిపిస్తోందండి. ఈ వానకి ట్రైన్స్ క్యాన్సిల్ కావటంతో పాసింజర్స్ ఎవరూ లేరు. వెయిటింగ్ రూమ్ కూడా ఖాళీగా వుంది. ఆడవాళ్ళు ఎవరూ లేరు. పైగా కరెంటు కూడా వచ్చి పోతూంది. అందుకని కాస్త నా పరిస్థితిని అర్థం చేసుకుని ఈ ఒక్కరాత్రికి దయతో మీ ఇంట్లో ఆశ్రయం ఇస్తే మీకు ఋణపడి వుంటానండి. తెల్లవారు ఝామున ఐదింటికి లేచి వెళ్ళిపోతాను. ట్రైన్సు లేకపోయినా ఏ బస్సో పట్టుకోగల్ను'' అర్థింపుగా చూస్తూ మళ్ళి రెండు చేతులూ జోడించింది.

ఆ పిల్ల చెప్పిందంతా శ్రద్ధగా విన్న భార్యాభర్తలిద్దరూ ముఖాలు చూసుకున్నారు. అది గమనించిన ఆ అమ్మాయి—

"ఈ ఊళ్ళో నాకు ఎవ్వరూ తెలియదండి. ఎలాగా అని నేను భయపడుతుంటే దారంట వెడుతున్న ఒకాయన ఎవరో మీ ఇల్లు చూపించి'' ఆ ఇంటివాళ్ళని అడగండి. భార్యాభర్తలు చాలా మంచి వాళ్ళు. పైగా పెద్దవాళ్ళు. మీకే భయం ఉండదు. వాళ్ళు మీకు తప్పక సహాయం చేస్తారు'' అని ఆయన ఎవరో చెప్పారండి. అందుకనే... మీ ... తలుపుకొట్టాను...'' తలవంచుకుని గిల్టీగా చెప్పింది.

అంతలో ఆకాశం ఫెళఫెళా మెరిసింది. దూరంగా ఎక్కడో ఉరిమింది. దాంతో పాటు రివ్వున గాలి సన్న జల్లు మొదలయ్యాయి.

రోడ్లన్ని నిర్మానుష్యంగా వున్నాయి.

ఎదురుగా కనిపిస్తున్న రైల్వేస్టేషన్ కూడా రైలు కూతలతో గోలగా లేదు. నిశ్శబ్దంగా ఉంది దానికి తోడు ఈ లైన్లో కరెంటు పోయినట్లుంది. అంత చీకటిగా ఉంది. ఇంట్లోకి జల్లు కొడు

—వాకాటి కమల

తుంది.

"ముందు నువ్వు లోపలికిరా అమ్మాయ్" అన్నాడు వెంకటసుబ్బయ్య.

ఆ అమ్మాయి ఎయిర్ బ్యాగ్‌తో లోపలికి వచ్చింది.

"ఇంతకి ఏం ఉద్యోగం అమ్మాయ్" అన్నాడు వెంకటసుబ్బయ్య. మళ్ళీ మడత కుర్చీలో కూమని మట్టికి విప్పురావేస్తూ.

"నేను ఎం.కావ్., అండి. మా ఊళ్ళోనే ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాను. బ్యాంక్ టెస్టు పాసయ్యానండి. ఇంటర్వ్యూకి వచ్చాను" అంది. బ్యాగ్‌లోంచి చిన్న టవల్ తీసి తల చేతులు తుడుమకుంటూ.

వెంకటసుబ్బయ్య ప్రశంశగా "అయితే రిటెన్ టెస్టు పాసయ్యావన్న మాట" అన్నాడు.

"పాసయ్యానండి. రిటెన్ టెస్టు కూడా ఇక్కడికే వచ్చి రాశాను. ఉదయం వచ్చి రాత్రికి వెళ్ళి పోయానండి. ఈ వానల మూలాన ఇవాళే ఇలాగే అయింది పిన్నిగారూ" అంది శేషమ్మ కేసి చూస్తూ.

"ఒక్కోసారి అంతే అవుతుందిలే అమ్మాయ్. మనం ఒకటి అనుకుంటే వేరొకటి అవుతుంది" అంది శేషమ్మ.

శేషమ్మ జుత్తంత పండిపోయి ఓ పక్క పళ్ళూడాయ్. అరవై ఏళ్ళు దగ్గరకి వస్తున్నాయ్. ఇరుగు పొరుగు అంతా బామ్మగారని అమ్మమ్మగారని పిలుస్తారు.

కాని—

సుజాత లాంటి చక్కని ముక్క చదువుకున్న అమ్మాయి "పిన్నిగారూ" అనగానే ఆవిడకి ఎంతో ఆనందం వేసింది.

"ఆడపిల్లవి ఒక్కర్తివి ఎలా వచ్చావే తల్లి. నీ వెంట ఎవ్వరూ రాలేదా?" అంది ప్రేమగా.

"రాలేదు పిన్నిగారూ! మా నాన్నగారు చనిపోయ్యారండి."

"అయ్యో అలాగా అమ్మా. మచిలీపట్నంలో ఎవరెవరుంటారు?"

"నేను. మా అమ్మ, మా తమ్ముడు, చెల్లెలు వుంటామండి. మా చెల్లెలు తమ్ముడు బాగా చిన్నపిల్లలు."

"మీ అమ్మ కూడా ఏదన్నా ఉద్యోగం చేస్తుందా?"

"లేదు పిన్నగారూ! మా అమ్మ చదువుకోలేదు. పైగా ఆవిడ ఆరోగ్యం కూడా అంతంత మాత్రమే. మాకు పెద్దగా ఆస్తిపాస్తులు లేవు."

"చ్చొ... చ్చొ... చ్చొ! అయితే మీ కుటుంబానికి నీ ఉద్యోగమే ఆధారం అన్న మాట."

"అవును పిన్నిగారు, అందుకే కాస్త గవర్నమెంటు ఉద్యోగం కోసం శ్రమపడుతున్నాను. రిటెన్ టెస్టు రాయటానికి వచ్చినపుడు నాకు ఏ ఇబ్బంది ఎదురవ్వలేదు. ఉదయాన రైలు దిగి వెయిటింగ్ రూమ్‌లో స్నానం చేసి డ్రెస్ వేసుకుని క్యాంటిన్‌లో కాస్త తిని వెళ్ళి పరీక్ష రాసి తిన్నగా స్టేషన్‌కి వచ్చి మళ్ళీ కాస్త ఏదో ఇక్కడే తిని వెళ్ళిపోయాను.

ఈసారి అలాగే చేద్దామన్న ధైర్యంతో వున్నాను. కాని పరిస్థితి ఇలా ఎదురు తిరిగింది" అంది సుజాత.

"ఏం చేస్తారేం తల్లి. ఒకోసారి పరిస్థితులు ఎదురుతిరుగుతాయి. చిన్నట్నుంచి ఒకటే ముసురు. ఉభయ గోదావరి జిల్లాలు ముంపుకు గురి



అయ్యాయిట'' అంది శేషమ్మ.

''స్టేషన్‌కి దగ్గర్లో చాలా ఇళ్ళున్నాయ్. కాని ఎవరింట్లో పడితే వాళ్ళింట్లో వుండాలంటే భయం కదా పిన్నిగారు. రకరకాల మనస్తత్వాల వాళ్ళు వుంటారు. ఎలాగా అని నేను భయపడుతుంటే పాపం ఎవరో మీ ఇల్లు చూపించి పుణ్యం కట్టుకున్నారు. మిమ్మల్ని చూస్తుంటే నాకు మా ఇంట్లో వున్నట్లే వుందండి. మా బాబాయ్, పిన్ని కూడా అచ్చం మీలాగే ఉంటారు'' అంది సుబ్బయ్యకేసి చూస్తూ అభిమానంగా వెంకటసుబ్బయ్య ముసిముసిగా నవ్వాడు.

''ఒక్కరాత్రికి ఏం పోయిందిలే అమ్మాయ్. లంకంత ఇల్లు. ఆడపిల్లవి. ఆ మాత్రం ఆదరించలేమా?'' అన్నాడు దర్పంగా మట్ట పొగవదులుతూ.

''నాకు నలుగురు పిల్లలమ్మాయ్. ఇద్దరు మగపిల్లలూ, ఇద్దరాడపిల్లలూ. ఆడపిల్లలిద్దరికి పెళ్ళిళ్ళు అయ్యాయి. మా పెద్దబ్బాయ్ ఫారిన్‌లో వుంటున్నాడు. చదవటానికి వెళ్ళాడు. రెండోవాడు డాక్టరు కోర్సు చదువుతున్నాడు. వరంగల్‌లో వుంటాడు. ముసలాళ్ళం ఇద్దరం ఒంటరిగా వుండలేక మా పెద్దమ్మాయ్ కొడుకుని మా దగ్గర పెట్టుకున్నాం చదువుకి. వాడు డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కాలేజికి పది రోజులు శెలవులిచ్చారని వాళ్ళ అమ్మానాన్నల దగ్గరికి వెళ్ళాడు. ఈపాటికే రావాలి. కాని ఇదిగో ఈ వానలకి ఎక్కడో చిక్కుకుని వుంటాడు...'' అంది. లాంతరు వెలిగించి బాగా వత్తి తక్కువ చేసి తలుపు వారగా పెడుతూ శేషమ్మ.

ఆ రాత్రి ముగ్గురూ కబుర్లతో బాగానే కాలక్షేపం చేశారు.

వాళ్ళు తింటానికి భోజనం పెట్టారు. సుజాత తెగ మొహమాటపడింది.

''మీకెందుకండీ అనవసరంగా శ్రమ. నేను సాయంత్రం బాగా టిఫిన్ అది చేశాను'' అంది.

''ఫరవాలేదులే అమ్మాయ్. నీకు పిడికెడు పెట్టినంత మాత్రాన మా ఆస్తి తరిగిపోతుందా? అతిథి అభ్యాగతి అన్నారు'' అన్నాడు వెంకటసుబ్బయ్య. వరసలో ఆ పిల్ల పక్కన పీట మీద కూర్చుంటూ.

శేషమ్మ ఇద్దరికి వడ్డించి తను వడ్డించుకుంది.

''నీతో కల్సి సహపంక్తిని ఇలా తింటుంటే నా పెద్దకూతురు జ్ఞాపకం వస్తుందే తల్లి. నా కూతురు పార్వతి కూడా అచ్చం నీలాగే పిండితే పాలుకారేలా వుంటుంది'' అంది శేషమ్మ.

మీరు ఎప్పుడైనా మచిలీపట్నం వస్తే మా ఇంటికి రావాలి. కాని మేం మీ అంత ధనవంతులం కాదు. నాతనయినంతలో మంచి ఆతిధ్యమే ఇయ్యగలను'' అంది సుజాత.

''అయ్యో! అదేం మాటే తల్లి'' అంది శేషమ్మ.

ఆ రోజు రాత్రి పదకొండు గంటల దాకా కబుర్లు చెప్పుకుని ముగ్గురు పడుకున్నారు.

బయట వాతావరణం చల్లగా వుండటంతో వెచ్చగా గాఢనిద్రలోకి జారిపోయారు.

★ ★ ★

''అయ్యో! అయ్యో! అదేంటమ్మగారూ! తెల్లగా తెల్లారిపోయినాక కూడా పెరటి తలుపులు బార్లాగా తెరిసేసి పడుకుండిపోయినారు. అయ్యో అయ్యో! ఇల్లంత ఇట్ట సిందర వందరగ వున్నదేంటి? ఓలమ్మో! ఆ బీరువా తలుపులు అట్టా తెరిసేసినారేందమ్మగారూ! ఈ నిలుకు బట్టలన్ని నేల మీద పడేసి నాకేంటి... ఓ లమ్మో...'' లబలబలాడుతూ.

''గోలగా పనిమనిషి రావులమ్మ భుజం పట్టి కుదుపుతూ పిలుస్తుంటే ఏదో మత్తులోకం లోంచి విడివడుతున్నట్లు కళ్ళు తెరిచారు శేషమ్మ వెంకటసుబ్బయ్యలు.

నిజమే!

గదిలో గోద్రేజ్ బీరువా, అల్మారాలు, పెట్టెలు... అన్నీ తెరిచి పెట్టి వున్నాయ్. అందులో సర్దిపెట్టుకున్న బట్టలు అన్ని చిందరవందరగా నేలమీద పోగుపడి వున్నాయ్. వెండి బంగారాలు, ధాన్యం అమ్మగా వచ్చిన డబ్బు వున్న అరలు ఖాళీగా బోసిపోయి వెలవెల పోతున్నాయ్.

రాత్రి పడుకోబోయే ముందే అన్నీ గదుల తలుపులు జాగ్రత్తగా గడివాలు బీరువాలకి తాళాలు వేశారు. కాని ఇప్పుడవన్నీ తెరచి పెట్టి వున్నాయి. తాళాల గుత్తి భీరువాకే వ్రేలాడుతుంది.

రోజూ తెల్లవారుఝాము నాలుగు గంటలకి లేచి గోవింద నామాలు, సుప్రభాతం పాడుకుంటూ కూర్చునే ఆ ఇద్దరూ తెల్లగా తెల్లారి పనిమనిషి వచ్చి భుజం పట్టి కుదిపితేనే గాని నిద్రమంచాలు దిగలేదు.

ఇంకా కళ్ళు నిద్రతో కూరుకుని పోతున్నట్టు మత్తుగానే ఉంది. వాస్తవం సరిగా గుర్తు రావటం లేదు.

''ఓలమ్మో! ఏందమ్మ గారూ ఇది. రేత్తిరి దొంగలు గాని పడినారా ఏమి?'' అంటూ రావులమ్మ లబలబ గోలెడుతూ ఇల్లంత పరుగులు పెడుతూ'' ఓరినాయనో! కొంప మునిగినాది'' అంటూ కేకలు పెడుతుంటే శేషమ్మ సుబ్బయ్యలకి మత్తు దిగిపోయింది—

రాత్రి వచ్చిన అతిథి సుజాత కోసం పక్క మంచం కేసి చూశారు.

మంచం ఖాళీగా ఉంది.

జరిగిన మోసం అర్ధం అయ్యింది.

సంగతి విన్న రావులమ్మ.

''అయ్యయ్యో! అట్ట ముక్కు మొహం ఎరుగని ఓళ్ళని ఆడకూతురైతే మాత్తరం ఇంట్లోకి ఎందుకు రానిచ్చినారయ్య గారు! ఆ మద్దె మా అత్త ఇజైనగరం నుంచి వచ్చినాదని సెప్పినాన్. ఆళ్ళ వూళ్ళో మా అత్త పనిచేసే కాడ కూడా ఇట్టానే జరిగిందట. రెత్తిరి రైలు తప్పిపోనాది కాస్త పడుకుందుకీ జాగా ఇయ్యమని ఓ అమ్మాయి అడిగితే ఆడకూతురని జాలిపడి ఇంట్లో పడుకోనిచ్చారంట. అంత పండినాక అద్దరేత్తిరి ఆళ్ళ తాలూకు మనుషులు ఒత్తే ఈ పిల్ల సల్లగా తలుపు తీసి నాదంట! ఇంకేం? ఇంట్లో అందరికీ మత్తు మందు ఆసన చూపించి ఇల్లు మొత్తం దోచుకుపోనారంట. గిప్పుడు అట్టానే ఏదో జరిగుంటాదమ్మ గారూ?'' అంది రావులమ్మ గాభరాగా. నిజానికి ఇప్పుడు జరిగింది కూడా అంతే. పాతిక తులాల బంగారం, వెండి, అంతో ఇంతో డబ్బు దాచిపెట్టిన బీరువా అరలు ఖాళీగా కనిపిస్తుంటే... ''ఆ...'' అంటూ విరుచుకు పడిపోయింది శేషమ్మ.

తలకింద దాచిపెట్టుకున్న బీరువా తాళాలు బీరువాలకి వేలాడుతుంటే పిచ్చిపట్టిన వాడిలా వెర్రి చూపులు చూస్తున్నాడు వెంకట సుబ్బయ్య. ఆయన గుండెలు పగిలిపోలేదు. కాని అంత భాధగాను ఉంది.

★ ★ ★

ముగింపు...

ఈ కథ స్త్రీని కించపరచటానికి కాదు.

కాని ఈ కలికాలంలో స్త్రీ కూడా దొంగగా మోసకత్తెగా కొండకావో... హంతకురాలిగా రూపాంతరం చెందుతూంది. ఆమె వెనక వున్న దయనీయ పరిస్థితులు ఏమిటి? ఆదీ స్థితికి కారణం ఏమిటి?...

ప్రేమకి, మంచితనానికి, నిజాయితికి మారు రూపుగా పుట్టిన ఆమె ఇలా ఎందుకు దిగజారింది? ఎటువంటి సామాజిక పరిస్థితి ఆమెని ఆదీ స్థితికి దిగజార్చింది? అని ఒక్క నిమిషం ఆత్మ పరిశీలన చేసుకొని ఆలోచించండి.